భవన విజయం!

- గత ప్రభుత్వంలో పునాదులకే పరిమితమైన జీజీహెచ్ ఎంసీహెచ్ భవనం
- నాడు రెండుసార్లు శంకుస్థాపన చేసిన అప్పటి సీఎం చంద్రబాబు
- 2022 అక్టోబరులో శంకుస్థాపన చేసిన మంత్రి విడదల రజిని
- 14 నెలల్లోనే నాలుగంతస్తుల భవన నిర్మాణం
- మరో మూడు నెలల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్న ఎంసీహెచ్ వార్డు
- రూ.86 కోట్లతో ప్రభుత్వం, జింకానా సంయుక్త ఆధ్వర్యంలో నిర్మాణం



ఎంసీహెచ్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి విడదల రజిని, ఇతర ప్రజాప్రతినిధులు (ఫైల్)

గుంటూరు మెడికల్: కేంద్ర ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు ఇచ్చి గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఎంసీహెచ్ వార్డు నిర్మాణం చేపట్టాలని గత తెలుగుదేశం ప్రభుత్వానికి ఆదేశాలు ఇచ్చింది. అయితే అప్పటి సీఎం చంద్రబాబునాయుడు రెండుసార్లు ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు శంకుస్థాపనలు చేశాడే తప్ప, ఒక్క ఇటుక కూడా వేయలేదు. భవన నిర్మాణం కోసం తవ్విన గోతుల్లో వర్షపు నీరు నిల్వ ఉండి క్రిమికీటకాలు చేరి ఆసుపత్రిలో ఉండే రోగులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఉన్న ఎంసీహెచ్ వార్డు భవన నిర్మాణాన్ని రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనులు ప్రారంభించింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే మొట్టమొదటి ప్రాధాన్యతగా ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.

మంత్రి విడదల రజిని చొరవ..

మహిళల కష్టాలు తెలుసుకున్న మంత్రిగా, ముఖ్యంగా గర్భిణుల బాధలను స్వయంగా చూసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎంసీహెచ్ నిర్మాణ పనులపై దృష్టి సారించించారు. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఎంసీహెచ్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చొరవ చూపించారు. అనంతరం 2022 అక్టోబరులో జింకానా సభ్యులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి హామీ ఇవ్వడంతో కేవలం 14 నెలల వ్యవధిలో నాలుగు అంతస్తుల భవన నిర్మాణం జరిగింది. ఎంసీహెచ్ భవన నిర్మాణం పూర్తయ్యే వరకు స్త్రీలు, గర్భిణులు ఇబ్బంది పడకుండా సీబీఐ సంస్థతో మాట్లాడి కార్పొరేట్


నాలుగులు అంతస్తులు పూర్తయిన జీజీహెచ్‌లో ఎంసీహెచ్ భవనం

రెస్పాన్స్‌బులిటీలో భాగంగా గైనిక్ వార్డును ఆధునికీకరించేందుకు రూ.67 లక్షలు మంజూరు చేయించారు. ప్రస్తుతం కాన్పుల వార్డు ఆధునికీకరణ పనులు సైతం చురుగ్గా జరుగుతున్నాయి.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక శ్రద్ధ ...

ఎంసీహెచ్ నిర్మాణ పనులపై సర్వత్రా సందేహాలు, ఆందోళనలు వైద్యుల్లో వ్యక్తం అయ్యాయి. నాటి జింకానా అధ్యక్షుడు, అమెరికాకు చెందిన సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి 2019 జూలై నెలలో గుంటూరు వచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి జింకానా వైద్యుల్లో ఉన్న సందేహాలు వ్యక్తం చేసి ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి అప్పటి ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి జవహర్‌రెడ్డికి ఆదేశాలు ఇవ్వటంతో నిర్మాణపనులు ప్రారంభమయ్యాయి. జవహర్‌రెడ్డి జీజీహెచ్‌కు వచ్చి ఎంసీహెచ్ నిర్మాణ పనులు స్వయంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలన్నర వ్యవధిలోనే ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసే దిశగా అడుగులు వేసింది. అందులో భాగంగా ముఖ్యంగా గుంటూరు జీజీహెచ్‌లో నిర్మాణానికి నోచుకోకుండా శిలాఫలకాలకే అంకితమైన ఎంసిహెచ్ వార్డు నిర్మాణ పనులపై దృష్టి సారించింది.

మాతాశిశు మరణాల తగ్గింపే లక్ష్యం..

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఎంసీహెచ్ వార్డు నిర్మాణం జరుగుతుంది. పూర్వ వైద్య విద్యార్థులంతా విరాళాలు సేకరించి మాతృరుణం తీర్చుకునేందుకు రూ. 86 కోట్లతో ఎంసీహెచ్ వార్డు నిర్మిస్తున్నారు. మాతా శిశు మరణాల తగ్గింపే లక్ష్యంగా భవన నిర్మాణం జరుగుతోంది. ఎంసీహెచ్ వార్డు నిర్మాణం సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, ఐదంస్తులతో జరుగుతోంది. స్త్రీ, ప్రసూతి వైద్య సేవలతోపాటు, శిశు వైద్య సేవలకు ప్రత్యేకంగా గదులను నిర్మిస్తున్నారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనల మేరకు ఎంసీహెచ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎక్కడా లేని విధంగా కేవలం తల్లి, బిడ్డ వైద్య సేవల కోసం ఐదు అంతస్తుల భవన నిర్మాణం జరుగుతుండడం ఇదే మొట్టమొదటిసారి. భవనంలో 600 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఎంసీహెచ్ వార్డు నిర్మాణం పూర్తయితే పోస్టు ఆపరేటివ్ వార్డు, ప్రీ ఆపరేటివ్ వార్డు, ఆపరేషన్ థియేటర్, ఎన్ఐసీయూ, ల్యాబ్, డిస్పెన్సరీ, డెలివరీ సూట్స్, తల్లులు వేచి ఉండే గది అన్నీ కూడా ఒకే భవనంలో అందుబాటులోకి వస్తాయి. కార్పొరేట్ ఆస్పత్రి మాదిరిగా ఒకేచోట అన్ని వైద్యసౌకర్యాలు ఉండటం ద్వారా తల్లికి, బిడ్డకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి. తద్వారా తల్లి బిడ్డ మరణాలు సైతం తగ్గుముఖం పడతాయి.

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి విడదల రజిని, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు, డీఎంఈ డాక్టర్ నరసింహం, కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫాల ప్రత్యేక చొరవతో నేడు ఎంసీహెచ్ భవన నిర్మాణం నాలుగంతస్తులు పూర్తయింది. మరో మూడు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు పనులు చేస్తున్నారు. ఎంసీహెచ్ వార్డు నిర్మాణం ఆసుపత్రి చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతోంది. భవన నిర్మాణానికి విరాళాలు అందజేసి జీజీహెచ్ అభివృద్ధికి నిరంతరం తోడ్పాటు నందిస్తున్న జింకానా వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

– డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్

పబ్లిసిటీకి వాడుకున్న చంద్రబాబు...

గత టీడీపీ పాలనలో ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులను చంద్రబాబు నాయుడు ప్రచారానికి వాడుకున్నారనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. గత ప్రభుత్వ పాలనలోని ఐదేళ్లల్లో ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న సామెత చందాన ఉన్న గుంటూరు జీజీహెచ్‌లోని మాతా, శిశు ఆరోగ్య సంరక్షణవార్డు (ఎంసీహెచ్ వార్డు) నిర్మాణ పనులు ఉన్నాయి. చంద్రబాబు ప్రభుత్వంలో ఒక్క అంగుళం కూడా పనులు ముందుకు జరగలేదు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి హోదా 2015 అక్టోబర్ 2వ తేదీన గుంటూరు జీజీహెచ్‌కు వచ్చి శిలాఫలకం వేశారు. ఏడాదిలో భవన నిర్మాణం పూర్తిచేసి మెరుగైన వైద్యసేవలను అందించాలని నాడు చంద్రబాబు వైద్యాధికారులకు, ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఆయన ఆదేశించినా ఎంసీహెచ్ భవనం నిర్మాణం ఒక్క అంగుళం కూడా ముందుకు సాగలేదు. మరలా రెండోసారి చంద్రబాబునాయుడు 2018 డిసెంబర్‌లో జీజీహెచ్‌కు వచ్చి ఎంసీహెచ్ వార్డు నిర్మాణం కోసం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

వాడవాడలా సంక్రాంతి సంబరాలు


దుండివారిపాలెంలో కబడ్డీ ఆడుతున్న యువకులు

కర్లపాలెం: మండలంలోని పలు గ్రామాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాలలో మహిళలు రంగు రంగుల ముగ్గులు వేశారు. పలు రకాల పిండి వంటలు చేశారు. మహిళలు ముగ్గుల పోటీలలో పాల్గొనగా యువకులు కబడ్డీ, రన్నింగ్ పోటీలలో పాల్గొన్నారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. వీధులలో గంగిరెద్దులు ఆట పాటలతో మురిపించాయి. మండలంలోని దుండివారిపాలెంలో పండుగ సందర్భంగా రన్నింగ్, వాలీబాల్, కబడ్డీ, ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. దమ్మనవారిపాలెంలో మహిళలకు తాడులాగుడు పోటీలు యువకులకు కబాడీ పోటీలు నిర్వహించారు. కేశవపురి, యాజలిలో వాలీబాల్ పోటీలు, ముగ్గుల పోటీలు జరిగాయి. నల్లమోతువారిపాలెంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో జరిగిన పలు రకాల పోటీలలోని విజేతలకు బహుమతులు అందజేశారు.

ఊరూరా సంక్రాంతి సందడి

పిట్టలవానిపాలెం: ఊరూరా సంక్రాంతి ఘనంగా నిర్వహించారు. పిట్టలవానిపాలెం మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగ వేడుకలను రంగ...రంగవైభోగంగా నిర్వహించారు. చిన్నారులకు, మహిళలకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు.అనంతరం ముగ్గుల పోటీలను నిర్వహించగా ఆయా గ్రామాలలోని మహిళలు భారీగా పాల్గొన్నారు.


రేపల్లెలో కోలాట ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

మహిళలకు ముగ్గుల పోటీలు

రేపల్లె రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో సోమవారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు ఆటల పోటీల నిర్వహించి బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలలో పి.శిరీష, పి.లక్ష్మి, కె.మానస వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకోగా పోటీలలో పాల్గొన్న వారికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. అదేవిధంగా మ్యూజికల్స్ చైర్‌లో నాగచైతన్య, భవ్యశ్రీ, సత్యనారాయణ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించగా, భవానీ నాగలక్ష్మి, నాగకార్తికేయ స్కిప్పింగ్‌లో ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించారు. వీరికి బహుమతులు అందజేశారు. అనంతరం చిన్నారులతో నృత్యప్రదర్శనలు, భట్టిప్రోలు మండలం వెల్లటూరుకు చెందిన ముకుందా కోలాటం సభ్యులతో కోలాట ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఆదర్శ వేదిక కార్యదర్శి యడ్లపల్లి కిషోర్‌బాబు, సిహెచ్.దుర్గారావు, ఎస్.విజయ్‌కుమార్, నటరాజ్, రాంబాబు, రామకృష్ణ, రవికిరణ్, మాధవి, ఎం.పద్మజ, మోహనరావు, కృష్ణవేణి, ప్రవీణ పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని చలపాటివారిపాలెం గ్రామంలో గ్రామ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

అయ్యప్పస్వామికి విశేషంగా అభిషేకాలు


పండ్ల రసాలతో అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న కొండా గురుస్వామి

తెనాలిటౌన్: మకర సంక్రాంతిని పురస్కరించుకుని పలుచోట్ల అయ్యప్పకు అభిషేకాలు నిర్వహించారు. పట్టణ మారీసుపేటలోని బాలాత్రిపురసుందరి సమేత శ్రీ చంద్రమౌళేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సంక్రాంతి సందర్భంగా అయ్యప్పస్వామి జ్యోతి దర్శనం ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి గ్రంధి గోపాలకృష్ణమూర్తి-ఝాన్సీ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగఫణిశర్మ విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతుమాధవరావు, వరదా శేషగిరిరావు, పాన్నూరు శశిధరరావు, తాడిపర్తి హరిప్రసాద్, అంకమరాజు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

● మారీసుపేటలో కొండా గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి వివిధ పండ్ల రసాలు, విబూధి చందనాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.


చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో జ్యోతి వెలిగిస్తున్న న్యాయమూర్తి గోపాలకృష్ణమూర్తి

● బాలాజీరావుపేటలోని ప్రధాన అయ్యప్ప ఆలయంలో సంక్రాంతి పండుగ వేడుకలను వైభవంగా జరిపారు. ఉదయం అయ్యప్పస్వామివారిని దివ్య మంగళరథంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం కర్పూర జ్యోతిని వెలిగించారు. ఆలయ ప్రధాన అర్చకులు దుర్భా హరిబాబు స్వామి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి పాలాభిషేకం చేశారు. అయ్యప్ప మాలధారులకు ఫలహారం, బిక్ష ఏర్పాటుచేశారు. మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కేజీ బేసిన్ గ్యాస్, చమురు ఆంధ్రుల హక్కు

డాక్టర్ కొల్లా రాజమోహన్

బాపట్ల అర్బన్: కేజీ బేసిన్ బంగాళాఖాతం సమీపంలో ఉన్న ఆయిల్ గ్యాస్ నిక్షేపాలు ఆంధ్రుల సొత్తు, రాజ్యాంగ హక్కు అని కేజీ బేసిన్ గ్యాస్ పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్ పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక, కేజీ బేసిన్ గ్యాస్ పోరాట కమిటీ, రైతు సంఘం, ఇతర ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కేజీ బేసిన్ చమురుని క్షేపాలపై మంగళవారం బాపట్లలోని ఎన్జీ హోమ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. డాక్టర్ కొల్లా మాట్లాడుతూ 12వ ఆర్థిక సంఘం సిఫార్సులకు అనుగుణంగా 50 శాతం కేజీ బేసిన్ నిక్షేపాలు లాభాలు ఆంధ్రకే చెందాలని డిమాండ్ చేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అధికార ప్రతిపక్ష పార్టీలు ఈ అంశాన్ని వారి మేనిఫెస్టోలో చేర్చాలని, చర్చ జరగాలని కోరారు. మన రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలన్నీ ఈ విషయంపై మాట్లాడాలని రానున్న ఎన్నికలు అందుకు సరైన సమయం మని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో విశ్రాంత అధ్యాపకులు గోరంట్ల శాంతారాం, ఫోరంపర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు, హేతువాద సంఘం ప్రతినిధి కరణం రవీంద్రబాబు, విశ్రాంత అధ్యాపకులు తోట రామాంజనేయులు, జి.వెంకటేశ్వర్లు, సీఐటీయూ కార్యదర్శి బి.తిరుమలరెడ్డి, రైతు సంఘం నాయకుడు రమణయ్య, ఆసోది శంకర్ ఎస్‌కే సుభాని, మీరా సాహెబ్, దాసరి లక్ష్మి, గుంటూరు సురేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొల్లా రాజమోహన్

త్రిపురనేని రామస్వామి ఆదర్శనీయుడు

బాపట్ల అర్బన్: త్రిపురనేని రామస్వామి ఆదర్శనీయులని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. వ్యవసాయ కళాశాలలో త్రిపురనేని రామస్వామి జయంతి మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కవిరాజుగా ప్రసిద్ధులైన త్రిపురనేని రామస్వామి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని విద్యార్థులను స్వాతంత్ర ఉద్యమంపై స్ఫూర్తి కలిగించేందుకు అనేక దేశభక్తి గీతాలను రాసి ప్రచారం చేశారన్నారు. హేతువాద రచనలను తెలుగు సాహిత్యంలోకి ప్రవేశపెట్టిన తొలి కవిగా ఆయన ప్రసిద్ధులని, ఆయన రచనల్లో మానవతావాదం ఉట్టిపడుతుందని అది విద్యార్థుల మానసిక వికాసానికి దోహదపడుతుందని వివరించారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన వీరు జస్టిస్ పార్టీ ద్వారా భారత పునర్జీవన ఉద్యమంలో భాగస్వాములయ్యారన్నారు. తొలుత త్రిపురనేని రామస్వామి చిత్రపటానికి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్.ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ కె.నిర్మల్ రవి కుమార్ పాల్గొన్నారు.


త్రిపురనేని చిత్రపటం వద్ద నివాళి

దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

తెనాలిరూరల్: దోపిడీ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్. రమేష్ బాబు వివరాలు వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. పెదవడ్లపూడికి చెందిన లారీ డ్రైవర్ జలసూత్రం సుబ్బారావు ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి దాటాక తెనాలికి రైలులో చేరుకున్నాడు. అక్కడి నుంచి స్వగ్రామం వెళ్లేందుకు బస్టాండ్ సమీపంలోని సాయిబాబా గుడి వద్దకు వచ్చి ఆటో కోసం ఆగాడు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయగా సుబ్బారావు నిరాకరించడంతో చంపుతామని బెదిరించి అతని వద్ద ఉన్న రూ.నాలుగు వేలు లాక్కు వెళ్లారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఏఎస్ఐలు పి.దేవప్రసాద్, షేక్ హైదర్ అలీ, పీసీలు పి.మురళి, ఎం.అంకయ్యలు కేసులో నిందితులను తెనాలి మండలం మల్లెపాడుకు చెందిన వరగాని ఆనంద్ వర్ధన్, ఆర్ఆర్ నగర్‌కు చెందిన షేక్ సంథానిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.వెయ్యి స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని సీఐ అభినందించారు.

తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

తెనాలిరూరల్: తెలంగాణ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్.రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. తెనాలి సుల్తానాబాద్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు వెంబడి మద్యం విక్రయాలు జరుగుతున్నాని ఎస్ఐ ఎం విజయ్‌కుమార్‌కు సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన ఎస్ఐ ఏఎస్ఐ హైదర్ అలీ, పీసీలు పి.మురళి, ఎం.అంకయ్యలతో కలసి అక్కడకు చేరుకున్నారు. ప్లాస్టిక్ గోతాల్లో మద్యం సీసాలను ఉంచి విక్రయిస్తున్న ఇద్దరిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులను సుల్తానాబాద్‌కే చెందిన కాట్రోతు శ్రీనునాయక్, రమావత్ కార్తీక్‌నాయక్‌లుగా గుర్తించారు. వారి వద్ద నుంచి 50 మ్యాన్షన్ హౌస్ ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తెలంగాణలోని కోదాడకు వెళ్లి అక్కడి వైన్ షాపులలో మద్యం కొనుగోలు చేసి ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. నిందితులను పట్టుకోవడంలో అప్రమత్తంగా వ్యవహరించిన ఎస్ఐ, సిబ్బందిని సీఐ అభినందించారు.

క్లుప్తంగా

గోగులమ్మకు ప్రత్యేక పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారికి సంక్రాంతి, కనుమ పురస్కరించుకుని ప్రాతఃకాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు కుటుంబ సమేతంగా దర్శించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. నిత్య పూజా కైంకర్యాలతో విరజిల్లుతూ భక్తుల మనోభీష్టాలను నెరవేర్చే అమ్మవారిగా గోగులమ్మకు ప్రతీతి. ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది.

గోదా రంగనాయక స్వామి కల్యాణం



ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వేణుగోపాల స్వామి దేవాలయంలో గోదా రంగనాయకస్వామి కల్యాణం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో అందె పావన్‌కుమార్-బాలా దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి మాట్లాడుతూ గోదాదేవి విష్ణువుపై భక్తితో ప్రతి నిత్యం ధరించిన మాలను స్వామి వారు ధరిస్తూ నెల రోజులు తిరుప్పావై పాసురాలు చదువుతూ చివరకు స్వామివారిలో ఐక్యమవుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. 2,500 మందికి అన్న ప్రసాదం చేశారు.

వైఎస్సార్ సీపీలో ముస్లింలకు ప్రాధాన్యం

అమృతలూరు(వేమూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముస్లింలకు తగిన ప్రాధాన్యం కల్పించినట్లు వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లా జోనల్ ఇన్‌చార్జి షేక్ ఇమామ్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల పార్లమెంట్ సీటు మైనారిటీలకు చెందిన షేక్ ఖాదర్ బాషాకు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. మైనార్టీలందరూ వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని కోరారు. మళ్లీ వైఎస్సార్ సీపీ గెలుపు కోసం మైనారిటీలు ఏకతాటి పని చేయనున్నట్లు వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

యడ్లపల్లి(వేమూరు): చుండూరు మండలం యడ్లపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు చుండూరు సబ్‌స్టేషన్ అసిస్టెంట్ ఇంజినీరు అర్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యడ్లపల్లి, దుండిపాలెం, పెనుగూదురుపాడు గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

19న మోదుకూరులో వేమన జయంతి మహోత్సవం

మోదుకూరు(తెనాలి): చుండూరు మండల గ్రామం మోదుకూరులో వేమన జయంతి మహోత్సవాన్ని ఈనెల 19న నిర్వహించనున్నారు. మోదుకూరు వేమన జయంతి ఉత్సవ కమిటీ, ఆంధ్ర లయోలా కాలేజీ, విజయవాడ సంయుక్త నిర్వహణలో గ్రామంలోని వేమన సాహిత్య వికాస భవనంలో ఈ వేడుకలు జరగనున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకు చుండూరు మండల స్థాయి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు వేమన పద్య పఠన పోటీలు నిర్వహిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు విజేతలకు బహుమతి ప్రదానం, అనంతరం వేమన జయంతి ఉత్సవసభ ఉంటాయని నిర్వాహకులు తెలియజేశారు. 2019-24 వరకు మోదుకూరులో జరిగిన వేమన జయంతి ఉత్సవాల చరిత్ర రెండో భాగాన్ని సభలో ఆవిష్కరిస్తారు. ఆంధ్ర లయోలా కాలేజి ప్రాచార్యులు ఆచార్య గుజ్జుల ఆంటోనీ పీటర్ కిషోర్ అధ్యక్షత వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెర్ప్ సీఈవో ఏఎండీ ఇంతియాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. రాష్ట్ర ప్రభుత్వ బీసీడీఈ కార్యదర్శి, సీఈవో డాక్ట్ ఎంఎల్ఎస్ దేవకుమార్ విశ్రాంత ఆచార్యులు ఆచార్య గాచపాటి ఉమామహేశ్వరరావు, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు, 'అమ్మనుడి' సంపాదకుడు డాక్టర్ సామల రమేష్‌బాబు పాల్గొంటారని వివరించారు.

ఆర్థిక సాయం అందజేత

పేరలి(కర్లపాలెం): పేదవారి అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేయటం అభినందనీయమని వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, అఖండ ఫౌండేషన్ సభ్యుడు కాగిత కోటేశ్వరరావు తెలిపారు. పేరలి గ్రామానికి చెందిన మల్లెల సంసోను క్యాన్సర్ వ్యాధితో సోమవారం మృతిచెందారు. సంసోను భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ అందించిన రూ.5వేల నగదును ఫౌండేషన్ సభ్యుడు కాగిత కోటేశ్వరరావు మంగళవారం సంసోను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మల్లెల రవి, కాగిత జార్జ్, ఫ్రాన్సిస్ రత్నం, బి.వెంకటేశ్వర్లు, ఎం.శివరావు, కె.ముక్కంటి, జి.మీరయ్య పాల్గొన్నారు.

సెన్సార్ బోర్డు సభ్యురాలు హరిప్రియకు సన్మానం



రేపల్లె రూరల్: మండలంలోని ఉప్పూడి గ్రామానికి చెందిన అల్లంశెట్టి హరిప్రియ సెన్సార్ బోర్డు సభ్యురాలిగా ఇటీవల నియమితులైంది. హరిప్రియ గ్రామానికి విచ్చేసిన సందర్భంగా మంగళవారం ఆమెను వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి కలిసి శాలువా కప్పి పూలమాలలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సెన్సార్ బోర్డ్ సభ్యురాలిగా విధులు బాధ్యతగా నిర్వర్తించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన



బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలోని అలపర్తి ఎన్‌క్లేవ్ మచ్చవారి పాలెం రోడ్డులో సంక్రాంతిని 14వ రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 21 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ప్రదర్శనను మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

వైభవంగా సీతారామ చంద్ర స్వామి తెప్పోత్సవం



ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం): సీతారామ చంద్ర స్వామి దేవాలయంలో ధనుర్మాస మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సీతారామ చంద్రంస్వామి ఉత్సవ విగ్రహాలను సోమవారం రాత్రి చెరువులో ప్రత్యేకంగా అలంకరించిన పడవలో తెప్పోత్సవం నిర్వహించారు. తొలుత దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామిని చెరువు వద్దకు తీసుకుని వచ్చారు. చెరువు కట్టపై ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, ధనుంజయరాజు, అలకాపురం గ్రామ సర్పంచి మంతెన గంగరాజు పాల్గొన్నారు.

విశ్రాంత సైనిక ఉద్యోగి శ్రీహరి మృతి



పల్లెకోన(భట్టిప్రోలు): గ్రామానికి చెందిన విశ్రాంత సైనిక ఉద్యోగి మాచవరపు శ్రీహరి (42) అనారోగ్యంతో మృతి చెందాడు. 2003లో మిలటరీలో చేరిన శ్రీహరి గత ఏడాది ఏప్రిల్ 30న పదవి విరమణ పొందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

భారత సైనికుల సేవలను స్మరించుకోవాలి

తెనాలిఅర్బన్: దేశం కోసం ప్రాణత్యాగాలు చేస్తున్న భారత సైనికుల సేవలను అందరూ స్మరించుకోవాలని విశ్రాంత ఆర్మీ అధికారి మోహనరావు, 22వ ఆంధ్రా బెటాలియన్ అధికారి సుబేదార్ అవతార్ సింగ్ పేర్కొన్నారు. భారత సైనిక దినోత్సవాన్ని సోమవారం కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాలుర హైస్కూల్‌లో నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ భారత కమాండర్ ఇన్ చీఫ్‌గా కరియప్ప బాధ్యతలు స్వీకరించిన రోజును అందరు ఆర్మీ డేగా జరుపుకుంటారని చెప్పారు. దేశ క్షేమం కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ సైనికులు అందించే సేవలు మరువరానివని చెప్పారు. అనంతరం డ్రాయింగ్, వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అవతార్ సింగ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు షేక్ మౌలాబి, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, ఉపాధ్యాయులు పసుపులేటి మోహనరావు, సుందరరావు తదితరులు పాల్గొన్నారు.